

# ఏలియన్

సి.శివరామమూర్తి

**డా**క్టర్ ఎలెక్స్ డేవిడ్ అమెరికా స్పేస్ రీసెర్చ్ సెంటర్‌లోని ఒక ప్రఖ్యాత సైంటిస్ట్.

ఎలెక్స్‌కు చిన్నతనం నుండి ఒక ప్రత్యేకమైన అలవాటు ఉండేది. అది చీకట్లో కూర్చొని ఏకాంతంగా గంటల తరబడి ఆకాశంలోకి చూస్తూ గడపటం. నక్షత్ర మండలాలను ఆవరించిన ఈ అనంతాకాశమంటే తనకెందుకంత ఇష్టమో అనేక సంవత్సరాలుగా విశ్లేషించి విఫలమయ్యాడు, ఎటువంటి సమాధానం దొరకక. పుట్టుకతోనే కొంతమంది కొన్నికొన్ని స్వతసిద్ధమైన ఇష్టాలతో పుడతారని, అలాగే ఈ విశ్వంలో కొన్ని విషయాలకు కారణాలు దొరకవని, అంతకుమించి తర్కించి టైమ్ వేస్ట్ చేయకూడదని ఎలెక్స్ ధృవీకరించుకున్నాడు. ధృవీకరించుకున్న ఎలెక్స్ తన ఇష్టానికి పూర్తిగా లొంగిపోయి ఖగోళశాస్త్రంలో అనేక సంవత్సరాలు తపస్సు లాంటి కృషి చేశాడు. ఫలితంగా ఎలెక్స్, డాక్టర్ ఎలెక్స్ అయ్యాడు. ఆ తర్వాత అనతికాలంలో తన మేధాశక్తితో అంచెలంచెలుగా ఎదిగి స్పేస్ రీసెర్చ్ సెంటర్‌లో ఒక డైరెక్టర్‌గా ప్రత్యేక స్థానాన్ని, ప్రాబల్యాన్ని సంతరించుకున్నాడు.

ఒక దశలో ఎలెక్స్ తన జీవిత సర్వస్వాన్ని సైన్సుకు ధారపోయాలని అనుకున్నాడు. కానీ యాదృచ్ఛికంగా ఒక సందర్భంలో క్రిస్టీని కలుసుకున్నాడు.

ఆ ఇద్దరూ కలుసుకున్న తొలి చూపులో ఇద్దరి మదిలో మెరిసిన ఏకైక భావం.

ఎలెక్స్ – ఆదమ్ – సృష్టిలోని మొదటి పురుషుడు.

క్రిస్టీ – ఈవ్ – సృష్టిలోని మొదటి స్త్రీ.

సుమారు రెండు దశాబ్దాల క్రితం – ఫిబ్రవరి పధ్నాలుగు అంటే – వాలెంటెయిన్స్ డే రోజున – ఇరువురూ దంపతులయ్యారు. ఇద్దరి బంధం పాలు నీళ్ళలా, పూవుతావిలా కలసి పెనవేసుకుపోయింది. అయితే అన్నీ సజావుగా సాగటాన్ని దేవుడు కూడా భరించలేడు కాబోలు, ఇందుకు ప్రతీకగా ఎలెక్స్ జీవితంలో రెండు విషాదాలు జరిగాయ్.

ఒకటి ఎస్ట్రోనాట్ అయి, ఆకాశంలో విహరించాలని, చంద్రమండలంలో అడుగెట్టిన తొలి మానవుడు కావాలని తహతహలాడి పోయాడు ఎలెక్స్. అయితే భూమి గురుత్వాకర్షణ శక్తిని, గ్రావిటేషన్ శక్తిని అధిగమించి, భారరహిత స్పేస్‌లో ప్రయాణం చేయడం అందరికీ సాధ్యమయ్యే పని కాదు. అనేకమందికి ఆ సామర్థ్యం వుండదు. ఊపిరితిత్తుల్లోని కొన్ని లోపాల వల్ల డాక్టర్ ఎలెక్స్ స్పేస్‌లో ప్రయాణించే అర్హతను కోల్పోయాడు.

ఆ రోజున ఎలెక్స్ ఎంత క్రుంగిపోయాడంటే – కొన్ని సంవత్సరాల తపస్సు లాంటి కృషి చేసి, కొన్ని లక్షల కోట్ల డాలర్లు ఖర్చు పెట్టి ప్రయోగించిన రాకెట్ స్పేస్ కక్ష్యలోకి వెళ్ళకుండానే భూమి ఉపరితలంలోనే పేలిపోయి, కూలిపోయినపుడు కలిగే మనోస్థితి లాగా.

తనెప్పుడూ స్పేస్‌లో ప్రయాణించలేడు. స్పేస్‌లో ప్రయాణిస్తూ మబ్బుల మధ్యగా మెరిసిపోయే ఆకుపచ్చని భూగోళ మనోహర దృశ్యాన్ని తన రెండు కళ్ళతో ప్రత్యక్షంగా చూడలేడు.

ఈ అధ్యాయం ముగిసిపోయింది.

అలాగే రెండవ విషాదం !

తనలోని క్రోమోజోమ్స్ లోపంగా తనకెన్నడూ సంతానం కలగదని తెలిసిన తర్వాత...

అయితే క్రిస్టీ తన ప్రేమతో ఎలెక్స్‌లోని విషాదాన్ని అమృతంగా మార్చి వేసేది.

"ఫర్ గెట్ మైబోయ్.. పుట్టని మన పిల్లల మీద ప్రేమను కూడా మనం ఒకరికొకరు పంచుకుందాం... ఈ దురదృష్టాన్ని అదృష్టంగా మలచుకుందాం..."

ఇంతకాలం వారిద్దరి మధ్య ప్రేమబంధమే ఉండేది. కానీ క్రిస్టీలోని దయతో మిళితమయిన ప్రేమకు ఎలెక్స్‌లో కృతజ్ఞతా బంధం కూడా పెనవేసుకుపోయింది. అలా ఆ ఇద్దరూ అపూర్వ జంటగా మిగిలిపోయారు. ఇద్దరూ రెండు దశాబ్దాలు కలిసి ప్రయాణం చేశారు.

ఇది అమెరికన్ సొసైటీలో జరిగిన ఒక అపూర్వమైన సంఘటన.

ఇపుడు ఎలెక్స్ నలభై అయిదు. మరో ఐదు మెట్లు క్రిందగా క్రిస్టీ.

ఆ రోజు సాయంకాలం ఎలెక్స్ తన లేబరేటరీలో కూర్చొని ఫైల్స్ తిరగేవేస్తున్నాడు.

ఇంటర్‌కమ్‌లో బజర్ మ్రోగింది.

"గుడ్ ఈవినింగ్ డాక్టర్ ఎలెక్స్..." ఆవైపు నుండి ప్రొఫెసర్ రాబర్ట్.

"గుడ్ ఈవినింగ్..." గొంతు గుర్తుపట్టిన ఎలెక్స్ "ఇప్పుడే మీ గురించి ఆలోచిస్తున్నాను ప్రొఫెసర్."

"టైమ్ కొచ్చానని భావిస్తున్నాను. మీరు నా గురించి వెయిట్ చేయటం లేదు కదా..." ప్రొఫెసర్ రాబర్ట్ గొంతులో సున్నితమైన కర్టెసీ.

"నో... మీ పంక్చువాలిటీకి నా వాచీని కూడా సరిచేసుకోవాలి" అంతకంటే మృదువుగా స్పందించాడు ఎలెక్స్.

"థాంక్యూ డాక్టర్ ఎలెక్స్! పోర్టికోలో మీ కోసం కారు సిద్ధంగా వుంది."

"ఐయామ్ జస్ట్ రెడీ ప్రొఫెసర్... మరో రెండు నిమిషాలలో మనిద్దరం కలిసి ప్రయాణిస్తున్నాం..." ఎలెక్స్ ఫోను పెట్టేశాడు. మరో అరవై నిమిషాల తరువాత యూనివర్సిటీ క్యాంపస్‌లోని సెమినార్‌హాలుకు చేరారు.

స్టూడెంట్స్ ఎదురుగా కుర్చీల్లో కూర్చున్నారు. మరో రెండు నిమిషాల్లో సెమినార్ ప్రారంభం కానున్నది. అక్కడకు చేరిన స్టూడెంట్స్ చిన్న చిన్న గొంతుకలతో రహస్యం చెప్పుకుంటున్నట్లు మాట్లాడుకుంటున్నారు.

డాక్టర్ ఎలెక్స్ డేవిడ్‌ను అక్కడ ఉన్న అనేకమంది స్టూడెంట్స్ అంతకుముందు చూడకపోయినా, అతడందరికీ పరిచితుడే. ఆకాశంలో సూర్యుడు, నక్షత్రాలు ఈ మానవాళికెంత పరిచయమో, ఎస్ట్రానమీ ప్రపంచంలో మెరిసే అద్భుత నక్షత్రం – ఎలెక్స్ కూడా ప్రతి సైన్సు స్టూడెంట్‌కూ అంతే పరిచయం. డాక్టర్ ఎలెక్స్ పేరు తెలియని ఎస్ట్రానమీ స్టూడెంట్ ఉన్నాడంటే అతడు విజ్ఞానశాస్త్రాన్ని చదవటానికి అనర్హుడన్నమాట.

సెమినార్ మొదలయింది. రాబర్ట్ క్లుప్తంగా, అందంగా ఎలెక్స్‌ను పరిచయం చేశాడు. ఈలోగా ఎలెక్స్, అక్కడ వున్న స్టూడెంట్స్ బయోడేటాలో వాళ్ళవాళ్ళ వివరాలను చదివి ఆకళింపు చేసుకుంటున్నాడు.

“మై డియర్ స్టూడెంట్స్!” ఎలెక్స్ ప్రారంభించాడు. “మీ బయోడేటా వివరాలు, నిన్న నేను పంపిన ప్రశ్నావళికి మీరిచ్చిన సమాధానాలు చదివాను. మీలో ఎందరో మేధావులు, నాకంటే ఎంతో గొప్పవారు ఉండి తీరతారని నా మనస్సుకు అన్పించింది. అందుకని నేను మీకు బోధించే సాహసాన్ని చేయలేను. మనందరం కలసి ఇష్టాగోష్టిగా మాట్లాడుకొని ఒకరి సందేహాల్ని ఒకరు విశ్లేషించుకుందాం. అయితే మన మందరం, ఒకే ఒక నియమాన్ని పాటించవలసి ఉంటుంది. డూ యూ అండర్‌స్టాండ్”.

ఎలెక్స్‌లోని నిరాండబరత అతడి గొప్పతనాన్ని రెట్టింపు చేసింది. ఎలెక్స్ ఒక్క క్షణంలో అక్కడున్న వారందర్నీ ఆకట్టుకున్నాడు.

“లెటజ్ ప్రొసీడ్... డాక్టర్ ఎలెక్స్” అనేక ముక్తకంఠ స్వరాలు. ఎలెక్స్ చిరునవ్వు నవ్వి “నేను చెప్పబోయే నియమం అతి సింపుల్. మన మైండ్ సత్యాన్ని మాత్రమే అన్వేషించాలి. సత్యాన్నే ఆరాధించాలి. ఇక్కడ ఎటువంటి సెంటిమెంట్స్‌కు, వ్యక్తిగత అభిరుచులకు తావుండకూడదు. యామ్ ఐ రైట్...”.

“పర్‌ఫెక్ట్‌లీ ఆల్ రైట్...” ఇనుమడించిన ఉత్సాహంతో మళ్ళీ అనేక కంఠ స్వరాలు మేళవించాయ్!

ఎలెక్స్ ప్రారంభించాడు. "మనందరం ఎస్ట్రానమీ స్టూడెంట్స్. ఆకాశంలో నక్షత్రాలు, గెలక్సీలు, గ్రహాలు మన అధ్యయన విషయాలు ఏకాంతంలో కూర్చొని ఆకాశంవైపు ఒక సైన్సు స్టూడెంట్‌గా చూస్తూ వుంటే మనకేమని అన్పిస్తుంది?"

ఎలెక్స్ ప్రశ్నకు కొన్ని క్షణాలు పిన్‌డ్రాప్ సైలెన్సు.

"కమాన్ టెల్‌మీ..." కొంతసేపయ్యాక ఎలెక్స్ అడిగాడు.

"చాలా వింతగా ఉంటుంది. ఈ విశ్వంలో మనమూ, మన భూమి, సముద్రంలోని ఒక నీటి బొట్టులాగా అన్పిస్తుంది" ఒక స్టూడెంట్.

"నాకయితే మరో గ్రహానికి వెళ్ళి అక్కడేముందో చూడాలని అన్పిస్తుంది" మరో స్టూడెంట్.

"నాకూ అంతే. ఆ ప్లానెట్‌లో ఇక్కడిలాగానే నదులు, సముద్రాలు, జీవరాశి, మనలాంటి మనుషులు ఉంటారా? ఉంటే అక్కడ నాగరికత ఎలా వుంటుంది?" ఇంకో స్టూడెంట్ కామెంట్.

"డాక్టర్ ఎలెక్స్... ఈ అనంత విశ్వంలో ఒంటరిగా మనమేనా... లేకపోతే మనలాంటి జీవరాశి మరో గ్రహంలో కూడా ఉన్నదా..."

మళ్ళీ ఒక్కసారిగా నిశ్శబ్దం. ఆ తర్వాత చిన్నచిన్న గుసగుసలు.

"నో విస్పర్స్... ప్లీజ్ కమౌట్!" ఎలెక్స్ అభ్యర్థన.

ఉన్నట్టుండి టాపిక్ మరో గ్రహంలోని జీవరాశి గురించి కేంద్రీకృతమయ్యింది.

"డాక్టర్ ఎలెక్స్... మనలాంటి ఇంటలిజెంట్ రేస్ మరో గ్రహంలో ఉన్నారా..."

"అచ్చు ఇలాగే భూమి లాంటి మరో గ్రహం ఈ విశ్వంలో ఉంటుందా!"

మరో రెండు నిమిషాలు వ్యాఖ్యల్ని కొనసాగించాడు ఎలెక్స్.

తర్వాత "మైడియర్ స్టూడెంట్స్... గుడ్... మీ అందరి ప్రశ్నే నాది కూడాను. మీరడుగుతున్న ప్రశ్నలు అనేక దశాబ్దాలుగా నన్ను కూడా వేధిస్తున్నాయ్!"

"డాక్టర్ ఎలెక్స్... అసలు ఇంతకీ మరో గ్రహం గురించి మనం ఇంతగా ఆలోచించాల్సిన అవసరం ఏముంది?"

ఎలెక్స్ చెప్పాడు "అవును మీరన్నది నూటికినూరుపాళ్ళు నిజం. మరోగ్రహం, మరో జీవరాశితో మనకవసరం లేదు. మన ప్లానెట్ ఎర్త్‌లోనే అనేక సమస్యలున్నాయ్! దానిలో జీవించే మానవరాశి ఈనాడు ప్రమాదభరిత వాతావరణంలో మనుగడ సాగిస్తోంది. కానీ..."

అందరూ ఎలెక్స్ వైపు కుతూహలంగా చూస్తున్నారు.

ఎలెక్స్ ఒక్కసారి నలువైపులా చూసి "ఈ ప్రశ్నకు సమాధానం బహుశా మనతరం వారికి అవసరం లేకపోవచ్చు. కాని భావితరాలవారు ఈ సమాధానం కోసం విపరీతంగా అన్వేషించే రోజు వస్తుంది."

"వై..." ఒక స్టూడెంట్ ప్రశ్న.

"సైన్సు అంచనా ప్రకారం ఈ భూమిలో జీవరాశి మరో యాభైకోట్ల సంవత్సరాలకు సమూలంగా నశించిపోతుందని అంచనా. ఒకానొక రోజున ఈ భూమి మీద నదులు, సముద్రాలు ఆవిరైపోతాయ్. జీవరాశి మనుగడ సాగించలేని భయానక వాతావరణం ఈ భూమి మీద ఏర్పడుతుంది. ఆ తర్వాత భూమి సూర్యుడిలో లయించిపోతుంది. అలాగే ప్రజ్వలించే ఈ సూర్యుడు ఒకానొక నాడు పూర్తిగా ఆరిపోయి ఒక పెద్ద బ్లాక్ హోల్‌గా మారిపోయి నశించిపోతాడు. ఆనాడు మనమందరం ఏమవుతాం?"

నలువైపులా నిశ్శబ్దం ఆవరించింది. అందరూ తమకు తాము ఆలోచించుకుంటున్నారు.

ఎలెక్స్ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ "అందరికీ జరిగే విపత్తు గురించి మనం పట్టించుకోనక్కర్లేదు. నలుగురితోపాటు మనమూ... అవునా..." నవ్వాడు.

ఎలెక్స్ విశ్లేషణ కరెక్టే.

ఎలెక్స్ మళ్ళీ అన్నాడు. "కాని ఈ సమస్యకు పరిష్కారం ఉన్నదని నేను అనుకుంటున్నాను. ఈ భూమిలో ఏదైనా ప్రాంతంలో విపత్తు జరిగితే

మనం మరో రక్షిత ప్రాంతానికి తరలిపోతాం. వలస పోతాం. అలాగే మనం కూడా ఒకానొక రోజున ఈ భూమి నుంచి మరో గ్రహానికి, తరలిపోవాల్సి ఉంటుంది. ఈజిట్..."

కూర్చున్న స్టూడెంట్స్ మౌనంగా తలపంకించారు.

ఎలెక్స్ చిరునవ్వు నవ్వి "బహుశా ఖగోళశాస్త్రం ఈ ప్రశ్నకు బదులివ్వాల్సిన సమయం ఆసన్నమయిందని నేననుకుంటున్నాను. మన మందరమూ ఈ దిశలో అన్వేషించాల్సి ఉంటుంది. యామ్ఐ రైట్..." అన్నాడు.

"డాక్టర్ ఎలెక్స్... మన ప్లానెట్ మీదకు మరో గ్రహాంతరవాసులు అప్పుడప్పుడూ విజిట్ చేశారని అనేక ప్రచారాలు ఉన్నాయ్! ఇందులో సత్యమెంతవరకూ ఉంది?" ఒక స్టూడెంట్ ప్రశ్న!

"యస్... వైనాట్... ఈ విశ్వంలో సైన్సు అంచనాకు అందిన గెలాక్సీలలో సుమారు 400 కోట్ల సూర్యులు వున్నారు. ఈ నాలుగు వందల కోట్ల సూర్యులలో ఏదో ఒక సూర్యుడు చుట్టూ మనలాంటి భూమి తిరుగుతూ ఉంటుంది. అందులో మనలాంటి జీవరాశి ఉండటం అసంభవం కాకపోవచ్చు. అవునా..."

"యస్ వెరీమచ్ ప్రాబబుల్..." స్టూడెంట్స్ ప్రతిస్పందన.

"మరో గ్రహం నుంచి మనలాంటి ఇంటలిజెంట్ రేస్ మనలాగే అన్వేషిస్తూ ఉండవచ్చు."

"యస్" ఎలెక్స్ కంఠం దృఢంగా ఉంది. "అలా అని నేను ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను. మనకంటే ఎన్నోరెట్లు ఇంటలిజెన్స్‌లో, సైన్సులో అధిగమించి మరో గ్రహానికి చెందిన బుద్ధి జీవులు ఈ భూమ్మీదకు విజిట్ చేశారంటే పూర్తిగా కొట్టిపారేయాల్సిన విషయంగా నాకు అన్పించదు."

స్టూడెంట్స్ అందరూ చెవులు రిక్కించి కుతూహలంగా వింటున్నారు. ఎలెక్స్ "ఇది హైపోథీసిస్... ప్రస్తుతం ఇది సిద్ధాంతం వరకు మాత్రమే

పరిమితం. సైన్సు ఈ విషయాన్ని ఇలాగే అంగీకరించదు. దీనికి ఋజువులు, సాక్ష్యాలు కావాలి. అందరూ అంగీకరించే వాస్తవాల్ని అందరి ముందు నిరూపించాల్సి ఉంటుంది."

ఎలెక్స్ వాక్ప్రవాహానికి అడ్డుకట్టవేస్తూ ఒక మెసెంజర్ వచ్చాడు. ఎలెక్స్ చేతికి చిన్న చీటీ ఇచ్చాడు.

అది యూనివర్సిటీ ఆఫీసు నుండి మేనేజర్ పంపాడు.

"మిస్టర్ ఎలెక్స్! వెరీవెరీ అర్జంట్ మేటర్. మీ వైఫ్ క్రిస్టీ ఉన్నఫళాన కాంటాక్ట్ చేయమని రిక్వెస్ట్..."

ఎలెక్స్ ఏకాగ్రత భగ్నమయింది. "అంత ఎమర్జెన్సీ ఏమిటి?" ఎందుకనో తెలియదు. ఎలెక్స్‌లో చిరు ఆందోళన.

తనలోని భావసంచలనాన్ని బయటకు కనపడనీయకుండా "ఎక్స్‌క్యూజ్‌మీ... జస్ట్ టూ మినిట్స్ ప్లీజ్..." హాలు నుండి బయటకు నడిచాడు. హాలుకు ఆనుకొని వున్న లాన్స్‌లోకి నడిచి అంతవరకు ఆఫ్ అయివున్న సెల్ ఫోనును పాకెట్‌లోంచి తీసి ఆన్ చేసి క్రిస్టీకి డయల్ చేశాడు.

"ఎలెక్స్" క్రిస్టీ గొంతులో గాభరా. "నువ్వు వెంటనే విల్లాకు వచ్చేయ్! నీకో వింత సంఘటన గురించి చెప్పాలి."

"ఏమయింది క్రిస్టీ!" ఎలెక్స్ గొంతులో ఆందోళన. "ఆర్ యూ ఆల్‌రైట్... ఆర్ యూ సేఫ్"

"ఐ థింక్ సో... ఐ హోప్ సో... నువ్వు వెంటనే వచ్చేయ్!"

ఎలెక్స్ సెల్‌ఫోనులో నంబరు చూసి అడిగాడు. "నువ్వు విల్లా నుండి మాట్లాడుతున్నావా? నీపక్కన స్టీవ్ ఉన్నాడా?"

స్టీవ్ పూర్తి పేరు ఎడ్వర్డ్‌స్టీవ్. ఎలెక్స్ ఫ్యామిలి సెక్యూరిటీ గార్డ్.

"లేదు. ఇపుడే వస్తానని చెప్పి వెళ్ళి రెండు గంటలయింది ఎలెక్స్!".

ఎలెక్స్ గొంతులో ఆందోళన రెట్టింపయింది. "నువ్వు ఒక్కదానివి డ్రైవ్ చేయకు. నేను వచ్చి పికప్ చేసుకుంటాను."

"ఇప్పుడు టైమెంతయింది ఎలెక్స్!"

"ఆరవ్వటానికి ఇరవై నిమిషాలు..."

"మైగాడ్... ఇక్కడ మరొక్క క్షణం కూడా వుండలేను. సరిగ్గా ఆరయ్యేటప్పటికి ఇక్కడ..."

"ఏమవుతోంది. ఆర్‌యూ సేఫ్ క్రిస్టీ... ఆర్ యూసేఫ్"

"నీకు అన్నీ వివరంగా తర్వాత చెప్తాను. నేనిక్కడ నుండి వెంటనే బయలుదేరాలి" క్రిస్టీ గొంతులో కంగారు.

ఉన్నట్టుండి అటు నుండి రైనో–ఆల్సేషియన్ డాగ్ భయంకరంగా మొరగటం, ఇటువైపు ఎలక్స్‌కు వినపడుతోంది. హఠాత్తుగా టెలిఫోను 'డబ్'మని జారిపడిన శబ్దం.

ఎలెక్స్ కంగారుగా "క్రిస్టీ... క్రిస్టీ..." అని అరుస్తున్నాడు.

* * *

సరిగ్గా ఇదే సమయంలో భరత్ న్యూయార్క్ వాలీలో వున్న టొయాటా విలేజ్‌కి వెళ్ళే దారిలో తన మోటార్ బైక్ స్టార్టు కాక సతమతమవుతున్నాడు. అతనికి నాలుగైదు అడుగుల దూరంలో నెత్తిన హాట్ పెట్టుకొని వసుధ భరత్ వైపు చూస్తోంది. ఆమె కళ్ళల్లో సగం విసుగు... సగం ఆదుర్దా...

"బుల్ షిట్ బైక్" భరత్ కాలితో సైలెన్సరును ఒక్క తన్నుతన్నాడు.

"ఇంతవరకు మనల్ని మోసుకొచ్చి సేవ చేసింది. భరత్ అలా బైక్‌ను చావగొట్తే ఎలా?"

"ఇదిగో ఇలా ఈ అడవి మధ్యలో వదిలేసింది" భరత్‌లో అసహనం.

"క్రూరమృగాలు లేని అడవి. భయమెందుకు" నవ్వుతూ అంది వసుధ.

భరత్ ఆ మాటకు నలువైపులా కలియ జూశాడు. దూరంగా అనేక ఎకరాల విస్తీర్ణంలో చెట్లు, దారికి రెండు వైపులా పొదవాటి చెట్లు, నలువైపులా దట్టంగా కమ్ముకున్న భయంకరమైన నిశ్శబ్దం.

"డీప్ ట్రబుల్ వసూ! బైక్‌ను వదలి, అలా మెయిన్‌రోడ్‌కు వెళ్ళి అక్కడేదైనా వెహికిల్ పట్టుకొని వెడదాం..."

వసుధ అదోలా నవ్వుతూ "ఇది అమెరికా, ఇండియా కాదు. దారిలో వాళ్ళను అంత త్వరగా నమ్మి లిఫ్ట్ ఇచ్చేందుకు."

భరత్ విసుగ్గా "అవును. మనిద్దరం గాంగ్‌స్టర్స్‌లా కన్పడుతున్నాం కదా. లిఫ్ట్ అడిగి కారులో వాళ్ళను లూటీ చేసే వాళ్లలాగా!'

"ఇంతకి కింకర్తవ్యం భరత్!"

"ఇక్కడే కాపురం పెట్టేస్తే పోలా..."

"నీకెపుడూ అదే రంధి. సమయం సందర్భం లేకుండా..."

"పైన ఆకాశం, క్రింద పచ్చిక మైదానం, ఏకాంతం. కాసేపాగితే వెన్నెల, నక్షత్రాలు. ఇవన్నీ మనల్ని కుతూహలంగా చూస్తున్నాయ్!" భరత్ చిలిపిగా నవ్వాడు.

"అవును ఈ యువ జంట ఏం చేయబోతారా అని" వసుధ శృతి కలిపింది.

భరత్ ఏదో అనబోతుంటే దగ్గరిలో అలికిడి. ఎండుటాకుల మీద నడుస్తున్న సవ్వడి. ఇద్దరూ ఎలర్ట్ అయ్యారు. మళ్ళీ అలికిడి.

ఈసారి వసుధ గుండెల్లో దడ. భరత్‌లో ఎంత కంట్రోల్ చేసుకోవాలన్న, ఆగని ఆందోళన.

ఉన్నట్టుండి దూరంగా తుపాకీ పేలిన శబ్దం.

వసుధ భయంతో కెవ్వుమని కేక వేసింది. భరత్ రెండంగల్లో ఆమెను చేరుకొని చేయి పట్టుకున్నాడు. భరత్ మొహం పాలిపోయింది. "ఇపుడేం చేసేట్టు?"

కొన్ని క్షణాలు నిశ్శబ్దం.

ఆ తర్వాత ఆ మూల నుండి ఎవరో అరుస్తున్నారు. "హూ ఈజ్ దట్..."

భరత్, వసుధలు మొహమొహాలు చూసుకున్నారు.

ఆ ఇరువురు ఆలోచిస్తున్నారు. ఆ అరచింది ఎవరు? శత్రువా, మిత్రుడా... తాము ప్రమాదంలో ఉన్నామా... సేఫ్టీలో ఉన్నామా...

ఈసారి ఆ కంఠం మరింత దగ్గరయింది. "హు ఈజ్ దట్"...

భరత్ తేరుకొని ఆ వైపు చూశాడు. అపుడే ఆ రోడ్ కార్నర్ నుండి ఇటు వైపు తిరుగుతున్నాడు ఆరడుగుల ఆజానుబాహువు. అతని చేతిలో రైఫిల్.... వసుధకీసారి భయంతో గొంతు తడారిపోయింది. భరత్‌కు ఏం చేయాలో పాలుపోవడం లేదు. అలా ఇద్దరూ శిలా విగ్రహాల్లా నిల్చుండి పోయారు. మరో నిమిషంలో వేగంగా అడుగులు వేస్తూ ఆ ఆగంతకుడు వాళ్ళను చేరుకున్నాడు. ఈసారి స్పష్టంగా కనపడుతున్నాడు ఆ ఆరడుగుల నీగ్రో. దగ్గరకు వచ్చి ఆ ఇద్దర్ని తేలిపార చూశాడు.

"యూ ఆర్..." నీగ్రో ప్రశ్నించాడు.

"వుయ్ ఆర్ ఇండియన్స్... ఐయామ్ భరత్" గొంతు పెగల్చుకొని చెప్పాడు.

"షి ఈజ్ వసుధ. షి ఈజ్ మై..."

నీగ్రో పూరించాడు పెద్దగా నవ్వుతూ "యువర్ గర్ల్‌ఫ్రెండ్... ఈజిట్..."

భరత్ ఏదో చెప్పబోతుంటే నీగ్రో మళ్లీ అన్నాడు.

"డోంట్ వర్రీ... ఐయామ్ ఆల్‌సో యువర్ ఫ్రెండ్!. ఐయామ్ స్టీవ్... స్పేస్ సైంటిస్ట్ ఎలెక్స్ డేవిడ్ బాడీగార్డును".

ఆ మాటలకు భరత్, వసుధలు చూపులు మార్చిమార్చి చూసుకొని శ్వాసను తేలిగ్గా విడిచారు.

భరత్ రిలాక్సవుతూ స్టీవ్‌తో "మా బైక్ చెడిపోయింది" అన్నాడు.

"దగ్గరలో ఎలెక్స్ విల్లా వుంది. ఇక్కడ నుండి ఓ పదినిమిషాల ప్రయాణం. ఆ బైక్‌ను పక్కనపెట్టి లాక్ చేయ్ మిస్టర్ భరత్..."

భరత్ వసుధతో "డాక్టర్ ఎలెక్స్ నాకు యూనివర్సిటీలో విజిటింగ్

ప్రొఫెసర్. లెటజ్ ఫాలో స్టీవ్” అన్నాడు చిన్న గొంతుకతో.

“ఇప్పుడు టైమెంతయింది” స్టీవ్ అడిగాడు.

భరత్ వాచీ చూస్తూ “ఆరవ్వటానికి పది నిమిషాలు”.

స్టీవ్ ముందుకు అడుగులు వేస్తూ “సరిగ్గా ఆరుగంటలకు ఎలెక్స్ విల్లాలో ఉంటాము” అన్నాడు.

అప్పటికే భరత్ మోటార్ బైకును లాక్ చేసి వసుధ దగ్గరకు వచ్చి ఆమె చేతిలో చేయి వేసి స్టీవ్‌ను అనుసరించాడు.

భరత్ అడిగాడు “మిస్టర్ స్టీవ్! ఇక్కడికెలా వచ్చావ్?”

ఈ ప్రశ్నకు స్టీవ్‌లో రకరకాల ఆలోచనలు. తనీ సమయంలో ఇక్కడికెందుకొచ్చాడో ఎవరికి చెప్పలేడు. గత కొన్ని రోజులుగా ఎలెక్స్ విల్లాలో కొన్ని వింత సంఘటనలు జరుగుతున్నాయ్. అవి వాస్తవాలో లేక తనేమైనా ఊహించుకుంటున్నాడో తెలియదు. స్టీవ్‌లో అపుడపుడు తనమీద తనకే అపనమ్మకం కలుగుతోంది.

భరత్ మరోసారి తన ప్రశ్నను రెట్టించాడు.

ఈ లోకంలోకి వచ్చాడు స్టీవ్. “ఈ ప్రాంతాల్లో సూర్యాస్తమయం బాగుంటుంది మిస్టర్ భరత్! అపుడపుడూ ఇక్కడ కొచ్చి ఏకాంతంగా కూర్చొని అస్తమిస్తున్న సూర్యుడిని చూస్తూ ఓ రెండు పెగ్గులు విస్కీ తీసుకొని ఓ నాలుగు సిగరెట్లు కాల్చుకోవడం నా కిష్టమైన హాబీ...”

“కానీ ఇంత నిశ్శబ్దాన్ని భరించడం కష్టమే. ఒక్కోసారి ఈ నిశ్శబ్దం వైల్డ్‌గా ఉండి భయం వేస్తుంది” భరత్ అన్నాడు.

ఆ మాటలకు వసుధ అవునన్నట్లుగా చూసింది భరత్ వైపు. తన ఎడమ చేతితో వసుధ చేయిని సుతారంగా నొక్కాడు భరత్.

స్టీవ్ పెద్దపెట్టున నవ్వాడు. “మీ వయసుకు నిశ్శబ్దం విలువ తెలియదు. రాక్‌ఎన్ రోల్, పాప్ మ్యూజిక్ అంటే పడిచస్తారు. మీ యూత్ అవునా!”

“నో... నో...”

స్టీవ్ ఆశ్చర్యంగా చూశాడు. "మరేమంటే ఇష్టం?"

"మేము ఇక్కడకు చదువుకునేందుకు వచ్చాం. ఎంజాయ్ చేయటానికి కాదు స్టీవ్!"

స్టీవ్ అదోలా చూస్తూ "ఇండియాలో యూత్ ఎంజాయ్ చేయరా?" అన్నాడు.

"యూత్‌లో ఎంజాయ్ చేస్తే తర్వాత లైఫ్ అంతా విచారిస్తూ కూర్చోవాలి స్టీవ్!"

"యూత్‌ను మిస్ అయితే తర్వాత లైఫ్ అంతా రిగ్రెట్ అవ్వాలి" స్టీవ్ రిప్లై.

భరత్ ఏదో అనబోయాడు. వసుధ భరత్ చేయి నొక్కింది.

ఈలోగా స్టీవ్ వసుధ వైపు తిరిగి "నువ్వేమంటావ్ మిస్" అని అడిగాడు.

వసుధ స్టీవ్‌తో "భరత్ స్టేట్‌మెంట్‌లో చిన్న మార్పు. చదువుకొనే రోజుల్లో ఎంజాయ్ చేస్తే తర్వాత లైఫ్ అంతా విచారించవలసి వస్తుంది. యామ్ ఐ రైట్?"

స్టీవ్ భరత్ భుజం మీద పెద్ద చరుపు చరిచి పెద్ద పెట్టున నవ్వాడు. "అందుకనే ఆడవాళ్ళు మగవాళ్ల కంటే తెలివైన వాళ్ళని అందరూ ఒప్పుకుంటారు. యువర్ స్టేట్‌మెంట్ ఈజ్ ఫర్‌ఫెక్ట్‌లీ కరెక్ట్ మిస్" ఈసారి స్టీవ్ అసంకల్పితంగా వసుధ వీపును కూడా చరిచాడు. వసుధకు చిరుకోసం వచ్చి ఏదో అనబోతుంటే భరత్ తెలుగులో స్టీవ్‌కు తెలీకుండా చిన్న గొంతుకతో అన్నాడు.

"స్టీవ్‌కు ఎలాంటి దురుద్దేశాలు లేవు. పైగా మనకు సహాయం చేస్తున్నాడు."

"వాట్... వాట్...ఆర్ యూ టాకింగ్" అర్థం కాని స్టీవ్ అడిగాడు.

భరత్ స్టీవ్‌తో "నువ్వు చాలా తెలివైన వాడివని, మంచి వాడివని నా ఫ్రెండు మెచ్చుకుంటోంది" అన్నాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Alien**

* * *